క్లుప్తంగా

ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు



మాచర్ల: మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తులు ఘనంగా నిర్వహించుకొని, శివపార్వతుల ఆశీస్సులు పొందాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పీఆర్కే ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తక పఠనం..జ్ఞాన వికాసం



దాచేపల్లి: పుస్తకం చదివితే జ్ఞానం వస్తుందని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. నారాయణపురంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో రాఘవాచారి ప్రజా గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పుస్తకాన్ని మించిన మిత్రుడు మరొకరు లేరన్నారు. పుస్తక పఠనంతో మేధో వికాసాన్ని పొందొచ్చునని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, జిల్లా కన్వీనర్ కోసూరి రవికుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సి. కొదండరామిరెడ్డి, కార్యదర్శి బుర్రి కృష్ణారెడ్డి, కౌన్సిలర్ షేక్ షరీఫ్, తెలనాకుల సత్యనారాయణ, వేముల వెంకటరెడ్డి, ఆంజనేయరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

మాచర్ల రూరల్: మండలంలోని కంభంపాడు, రాయవరం గ్రామంలో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ కోటేశ్వరరావు పరిశీలించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని కూలీలకు మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేసి, సమయ పాలన ఖచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతర నిర్వహణపై 22న సమీక్ష

దుర్గి: ప్రసిద్ధిగాంచిన అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి జాతర మార్చి 12న నిర్వహించనున్న సందర్భంగా ఏర్పాట్లపై ఈ నెల 22న బుధవారం ఉదయం 11గంటలకు అమ్మవారి ఆలయ ముఖ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.రమేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

మాచర్ల: పట్టణంలోని నెహ్రూనగర్, వీరభద్రస్వామి పాఠశాలలో వైద్య సిబ్బంది డ్రైడే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం కిరీటి రెడ్డి, ఏఎన్ఎం నిర్మల, ఆశ వర్కర్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సుజాత, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మాచర్ల: వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ 2023 క్యాలెండర్‌ను మాచర్ల పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ రమణబాబు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ఏ సమస్యలున్నా పరిష్కరిస్తానని చెప్పారు. జి.సుభాష్‌చంద్రబోస్, శ్రీను నాయక్, బ్రహ్మాచారి, షెడరక్, తులసీ నాయక్, బాబు, రాకేష్, అమర్, శ్రీనివాసరావు, సునిల్, ఆనంద్, రామాంజనేయరెడ్డి ఉన్నారు.

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి



దుర్గి: విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కాపు సంఘం నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీటీసీ కటకం గోపాల్, కాపు సంఘం నాయకులు కటకం చిన వెంకటయ్య, యకటీల బుచ్చిబాబు, శెట్టిపల్లి కోటేశ్వరరావు, తోటకూర వెంకటేశ్వర్లు, చలవాది సత్యనారాయణ, తోట మూర్తి, యకటీల శ్రీను, వెలిదండి చంద్రజ్యోతి, మాదాసు భిక్షమయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రెంటచింతల: సైబర్ నేరాలు, ఖాతాల్లో నగదు గల్లంతుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ మాదాసు రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెంటాల గ్రామంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కర్నూల్ సహకారంతో మాచర్ల శాఖ ఆధ్వర్యంలో రెంటాల గ్రామస్తులకు బ్యాంకింగ్ పథకాలపై, ఆన్‌లైన్‌లో నగదు గల్లంతుపై కళాజాత బృందం అవగాహన కల్పించింది. ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ ఏలూరి నాగరాజు, వీఓఏ ఉడుతూరి సీతమ్మ, కళాకారులు మాగులూరి రాంబాబు, పులిమెల పాల్గొన్నారు.

ప్రతి మార్గం.. శివపూజ కోసం

- శివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధం
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు, అధికారులు
- శివనామస్మరణతో మారుమ్రోగనున్న ఆలయాలు

బిలంలో అమరలింగేశ్వరుడు..

గురజాల: భోగభాగ్యాలిచ్చే అమరలింగేశ్వరుడు. బిలంలో కొలువుదీరి కొలిచిన వారి కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. మండల పరిధిలోని దైద గ్రామ సమీపంలో కృష్ణానది తీరంలోని బిలంలో కొలువైన స్వామివారి శతాబ్దంగా భక్తుల పూజలందుకుంటున్నారు.

ఆలయ ప్రాశస్త్యం..

వందేళ్ల క్రితం పులిపాడు గ్రామానికి చెందిన కోంద్రు రామయ్య అనే పశువుల కాపరి ఆరె చెట్టుకింద విశ్రాంతి తీసుకుంటుండగా పవిత్రంగా అమరలింగేశ్వరుడిని భక్తితో కొలవండి అనే శబ్దాలు వినిపించాయి. భయంతో గ్రామస్తులను తీసుకొచ్చి..ఆ ప్రాంతంలో వెతకగా.. వారికి పురాతనమైన బిలం బయటపడింది. బిలంలోకి వెళ్లగా ఎన్నడూ చూడని ఒక గర్భాలయం కనిపించింది. ఋషులు, మునులు, యోగులతో పూజలందుకు నేను..ఇక మీ చెంతనే ఉంటానని ఓ శివలింగాన్ని చూస్తుండగా శక్తివంతమైన వెలుగు మాయమైపోయింది. ఆ క్షణం నుంచి భక్తులకు కొంగు బంగారమై.. అమరలింగేశ్వరుడిగా భక్తుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్నారు.

■ మహా శివరాత్రి ఉత్సవాలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. కృష్ణానదిలో స్నానమాచరించి బిలంలో కొలువైన అమరలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే మనస్సులో వున్న కోర్కెలు వెంటనే తీరుతాయని భక్తుల విశ్వాసం. శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు.. ఈఓ సురేష్ గణపతి చెప్పారు. మహిళలకు ప్రత్యేకంగా గదులు, తాగునీటివసతి, అన్నదానానికి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. కృష్ణానదిలో స్నాన మాచరించే భక్తుల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, జాలర్లును అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

భక్తుల కొంగుబంగారం సారంగధరేశ్వరుడు

దాచేపల్లి : భక్తుల పాలిట కొంగుబంగారం శ్రీ సారంగధరేశ్వరుడు. దాచేపల్లి మండలంలోని సారంగపల్లి అగ్రహారం గ్రామ సమీపంలోని కొండపై కొలువైన స్వామి తిరునాళ్ల మహోత్సవం శనివారం నిర్వహించనున్నారు. భూగర్భజలాలు అడుగంటినా.. ఆలయం ముందు మూడు అడుగుల లోతులో ఉన్న నీటి కొలను ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. ఈ నీళ్లు నెత్తిన చల్లుకుంటే శాంతికలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. శివరాత్రి పండుగకు 40 రోజుల ముందు నుంచే భక్తులు ఈ ఆలయంలో శివమాల ధరిస్తారు. పండుగ రోజు రాత్రి 11గంటల సమయంలో అగ్నిగుండ ప్రవేశం చేసిన తరువాత శివమాలను తీస్తారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ షేక్ బిలాలుద్దీన్ చెప్పారు.



కొండపై శివలింగాకారంలో కొలువైన సారంగధరేశ్వరుడు

ఇక దాచేపల్లిలోని శ్రీ నాగేశ్వరస్వామి సహిత పార్వతిసమేత ముక్తేశ్వరస్వామి దేవాలయం రెండవ కాశీగా పేరొందింది. శివాలయానికి ఒక వైపు నాగులేరు వాగు..మరో వైపు శ్మశాన వాటిక ఉంది. ఈ దేవాలయంలో ఏడుపడగల నాగేంద్రస్వామి దేవాలయం ఉంది. నాగేంద్రస్వామి శిరస్సు దాచేపల్లిలో.. నడుము నాగులేరులో... తోక కొదమగుండ్ల గ్రామంలో ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. శివరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని నవగ్రహాలకు ప్రత్యేకంగా పూజలు చేసి, శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిపిస్తారు.

గంగాపార్వతీ సమేత సూరేశ్వరుడు..

కారెంపూడి: కారెంపూడిలో క్రీ.శ 1082లో ప్రతిష్ఠ జరిగిన శ్రీ గంగాపార్వతీ సమేత సూరేశ్వరాలయం, అలాగే పెదకొదమగుండ్ల శివాలయం, చింతపల్లి మల్లికార్జునస్వామి, మిరియాల గ్రామ శివాలయం, ఒప్పిచర్ల శివారు నల్లమల అడవిలో ఉన్న ధనమల్లయ్యస్వామి ఆలయం చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయాలు. వేలాదిగా భక్తులు శివరాత్రి జాగారానికి తరలి వస్తారు. ఆలయానికి కూడా వేలాదిగా భక్తులు తరలి వస్తారు.



కారెంపూడిలోని సూరేశ్వరుడు

నీలకంఠేశ్వర నీ దర్శనం కోసం..

గురజాల : నగర పంచాయతీలోని శ్రీ గంగా పార్వతీ సమేత ఇష్టకామేశ్వరస్వామి, ముక్కంటేశ్వర స్వామి, వీర భద్రస్వామి, జంగమహేశ్వరపురంలోని శివాలయం, గోగులపాడు శ్రీ గంగా పార్వతీ సమేత నీలంకఠేశ్వర స్వామి ఆలయాలకు శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. నీలంకఠేశ్వ స్వామి దేవాలయంలో అన్నదానం, బ్రహ్మంగారి నాటకం, చిన్నారుల కోలాటం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



గోగులపాడు నీలకంఠేశ్వరస్వామి ఆలయం

దక్షిణ కాశీలో.. తేరాలలో మాత్రమే..

దుర్గి: మండల పరిధిలోని ప్రసిద్ధి శైవ క్షేత్రం తేరాల శ్రీ భ్రమరాంబిక సిద్దేశ్వర స్వామి ఆలయం. శివరాత్రి సందర్భంగా శనివారం భక్తులు దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు మహా అన్నదానం జరుగుతుంది. దక్షిణ కాశీలో, తేరాలలో మాత్రమే గోగర్భం నుంచి ఎంత లావు ఉన్నవారైనా దూరి స్వామి వారిని దర్శించుకునే మహత్ భాగ్యముంది. ఈ కట్టడంలో కనిపించే చిన్న రంధ్రం నుంచి స్వామి వారిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఆలయ కమిటీ అధ్యక్షుడు చౌకాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. బుగ్గ మల్లయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం చేయనున్నారు.

శివాలయాలకు మహాశివరాత్రి శోభ

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామ శివారులోని శ్రీ భ్రమరాంబ సమేత బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయం శివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. శివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు, ఆలయ ధర్మకర్తలు తెలిపారు.



బిలంలో కొలువైన అమరలింగేశ్వర స్వామి



తేరాల సిద్దేశ్వర ఆలయం



మోర్జంపాడులోని బుగ్గ మల్లేశ్వరస్వామి



గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం

మహాశివరాత్రికి సత్రశాల సిద్ధం

సత్రశాల(రెంటచింతల): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం. శివరాత్రి ఏర్పాట్లకు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి సర్వ సిద్ధం చేశారు. ఇప్పటికే క్యూ లైన్లు, బారిగేడ్లు ఏర్పాటు చేశారు. దేవస్థానం ఆవరణలో నాలుగు భారీ విద్యుత్ ప్రభల ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ సమాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాల్లో ఎండతీవ్రత లేకుండా ఉండేందుకు టెంట్లు వేసి, భోజన ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు.



కొలువుతీరిన మల్లికార్జునస్వామి

ప్రశాంత దర్శనానికి సహకరించండి..

రెంటచింతల: మండలంలోని సత్రశాలలో శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సయ్యద్ షమీర్ బాషా హెచ్చరించారు. శుక్రవారం సత్రశాల దేవస్థానం ఆవరణలో పోలీసు సిబ్బందికి, వలంటీర్లకు కారంపూడి సీఐ జయకుమార్ అధ్యక్షతన సమీక్ష, సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రశాంత దర్శనానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గురజాల, రెంటచింతల నుంచి వచ్చే వాహనాలకు మిట్టగుడిపాడు రోడ్డు మార్గాన అనుమతి లేదని తెలిపారు. వారు పాలువాయి జంక్షన్, పశర్లపాడు, జెట్టిపాలెం నుంచి సత్రశాల వెళ్లాలన్నారు. పాస్‌లు ఉన్నవారు వాహనాలను సత్రాలలో మాత్రమే నిలుపుకోవాలన్నారు. దేవస్థానం వద్ద వాహనాలను నిలపరాదన్నారు. విద్యుత్ ప్రభలను తక్కువ ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభలపై అశ్లీల నృత్యాలు, ఇతరులను కించపరిచేలా, ఇబ్బంది పెట్టేలా పాటలు పాడితే అటువంటివారిపై కేసునమోదు చేస్తామని హెచ్చరించారు. మహాశివరాత్రి రోజు సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద నుంచి వృద్ధులకు, దివ్యాంగులకు (వికలాంగులకు) నాలుగు ఆటోలను ఏర్పాటు చేసి వారిని దేవస్థానం వరకు ఉచితంగా తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, 110 మంది పోలీసు కానిస్టేబుల్స్, 100 మంది వలంటీర్లు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ భక్తులకు ప్రశాంతంగా దైవదర్శనం చేసుకునేందుకు సహకరిస్తారని తెలిపారు.



పోలీసు సిబ్బంది, వలంటీర్లతో సమావేశం

మాచర్ల చరిత్ర పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: పల్నాటిలోని ప్రముఖ ప్రాంతమైన మాచర్ల నియోజకవర్గ చరిత్రను అద్భుతంగా లిఖించి పుస్తకం తయారు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పీఆర్కే, పీవీఆర్‌లు రచయిత బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రతి గ్రామ చరిత్రతో పాటు సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ప్రపంచ పర్యాటక కేంద్రమైన సాగర్ గురించి అన్ని వివరాలతో సమగ్రంగా పుస్తకాన్ని తీసుకురావటం సంతోషకరమన్నారు. బ్రహ్మనాయుడు, ఆయన బృందాన్ని పీఆర్కే, పీవీఆర్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు కోటేశ్వరరాచారి, చంద్రశేఖర్, రాజేష్, అనిల్, సాయి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోర్జంపాడులో ఉచిత వైద్య శిబిరం

మాచవరం: మండలంలోని మోర్జంపాడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో అరబిందో ఈఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. బీపీ, షుగర్, థైరాయిడ్, గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో జోన్-2 సూపర్ వైజర్ విశ్వేశ్వరావు, పీఎస్ వెంకటస్వామి, పుష్పకుమారి, రాజేశ్వరి, 104 వాహన సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యనభ్యసించాలి



బహుమతులు అందజేస్తున్న రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు గోవిందరెడ్డి, హెచ్ఎం

మాచర్ల రూరల్: విద్యార్థి దశ నుంచే స్వామి వివేకానంద స్ఫూర్తితో ఉన్నత స్థానంలో నిలవాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు జడ్పీ హైస్కూల్ లో రామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు జాగృతి, సంస్కృతి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కాకర్ల రామ్మోహన్‌రావు, సభ్యులు షేక్ చిన లాలు సాహెబ్, ఎం.పాపిరెడ్డి, పిచ్చయ్య తదితరులున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

మాచవరం: మాచవరం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాలను జడ్పీటీసీ శివాయాదవ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తాతిరెడ్డి, ఉపాధ్యాయులు సత్యన్నారాయణరాజు, కంపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ముగిసిన ఎడ్ల బలప్రదర్శన



న్యూ కేటగిరి విభాగంలో విజేత పల్నాడు జిల్లా ఎడ్లు



బహుమతి అందజేస్తున్న ఏఈలు శ్రీనివాసరెడ్డి, నరేంద్రరెడ్డి

సత్రశాల(రెంటచింతల): సత్రశాలలో గంగా భ్రమరాంబ సమేత మల్లికారునస్వామి దేవస్థానం సమీపంలోని శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బండలాగు ప్రదర్శన పోటీలు శుక్రవారం చివరి రోజు న్యూ కేటగిరి విభాగంలో రసవత్తరంగా జరిగాయి. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటకం వెంకటేశ్వర్లు ఎడ్లు 4,298.2 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.45 వేలు సాధించాయి. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం గొర్రగుట్టు గ్రామం, తెలంగాణలోని సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం హుజూర్ నగర్ గ్రామానికి చెందిన ఏఎస్‌పీ సుంకి సురేంద్రరెడ్డి, సాకేత్‌రెడ్డి, సారికారెడ్డి ఎడ్లు సంయుక్తంగా 4,167.9 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి రూ.35 వేలు దక్కించుకొన్నాయి. పల్నాడు జిల్లా అమరావతి మండలం జిడుగు గ్రామానికి చెందిన బండి సాహిత్ శ్రీ భవణ్ ఎడ్లు 3,832.7 అడుగుల దూరం లాగి 3వ బహుమతి రూ.25 వేలను కైవశం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య ఎడ్లు 3,456.3 అడుగుల దూరంలాగి 4వ బహుమతి రూ.20 వేలను కైవశం చేసుకున్నాయి. ఈ విభాగంలో 10 జతల ఎడ్లు పోటీలలో పాల్గొన్నాయి. అన్నదాన సత్రం అధ్యక్షుడు పులి ఓబుల్ రెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, పత్తి కోటిరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, చింతా శివారెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి, పేరం వెంకటరామిరెడ్డి, గాదె వీరారెడ్డి, సిద్దవటం శివారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, నెవలి సీతారామిరెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి పర్యవేక్షించారు. పీఆర్ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, కంభంపాడు సర్పంచ్ ఆరికట్ల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి(ఎన్ఆర్ఐ), విజయభాస్కర్‌రెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, మూలగుండ్ల వేణుగోపాల్‌రెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, పాలువాయి గేటు సర్పంచ్ గొలమారి నాగలక్ష్మి శ్రీనివాసరెడ్డి, గొట్టం సైదారెడ్డి, పిన్నెల్లి కృష్ణారెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, గొట్టం అంకిరెడ్డి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, మేకపోతుల కృష్ణారెడ్డి, యర్రెద్దు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

దాచేపల్లి : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన దాచేపల్లి బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. దాచేపల్లికి చెందిన గుంజా నరసింహారావు(32) అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యక్తిగత పనులు నిమిత్తం నరసింహారావు బస్టాండ్‌కు వచ్చి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పిడుగురాళ్ల వైపు నుంచి అతివేగంతో వస్తున్న కారు నరసింహారావును ఢీకొట్టటంతో మృతిచెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారు వెళ్లిపోయింది. ఎస్ఐ సంధ్యారాణి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును ఎస్ఐ సంధ్యారాణి చాకచక్యంగా పొందుగల సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య సంపూర్ణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



మృతిచెందిన గుంజా నరసింహారావు

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థి చరణ్



విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న ఉపాధ్యాయులు

మాచవరం: మాచవరం జడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి మంటి చరణ్ రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం బి.తాతిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల నరసరావుపేటలోని సెయింట్ ఆన్స్‌లో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో వ్యవసాయంలో పర్యావరణ హిత పదార్థాలు అను అంశంలో మొదటి స్థానంలో నిలిచి, బహుమతిని గెలుచుకున్నట్లు వెల్లడించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు దావల అంగమయ్య సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌బీఐ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్ఎం రాథేశ్యామ్

దాచేపల్లి: బ్యాంక్ సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్‌బీఐ బ్యాంక్ రీజినల్ మేనేజర్ రాథేశ్యామ్ పేర్కొన్నారు. మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో దాచేపల్లి బ్రాంచ్ మేనేజర్ రామాంజనేయులు అధ్యక్షతన గ్రామ రైతు సంధ్యా శిబిరం శుక్రవారం నిర్వహించారు. రీజినల్ పరిధిలో రూ.20 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులు రైతులు, డ్వాక్రా మహిళలకు ఆయన అందజేశారు. రాథేశ్యామ్ మాట్లాడుతూ 200 ఏళ్ల అనుభవం ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్ తమ ఖాతదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ, సర్పంచ్ కటికాల వరలక్ష్మి, పుష్పాల శివ, ఉప సర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య, నడికుడి ఎస్‌బీఐ మేనేజర్ మల్లికార్జునరావు, ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్మన్ సుబ్బారావు

పిడుగురాళ్ల: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో భారతవనిత వార పత్రిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కార్క్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన మాజీ చైర్మన్ భవనాశి యల్లారావుతో కలిసి ప్రారంభించారు. మొదట జరిగిన మ్యాచ్‌లో లగాన్ సీసీ జట్టు పార్థు సీసీ జట్టుపై గెలుపొందింది. రెండవ మ్యాచ్‌లో క్రేజీ బాయ్స్ జట్టు అమరావతి జట్టుపై విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో వనిత శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మురళీ, నాయక్, సన్నీ, రవి, రత్నం, నిరంజన్ తదితరులు ఉన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి



నీటి డ్రమ్‌లో మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

విజయపురిసౌత్: ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని మాచర్ల మలేరియా సబ్ యూనిట్ అధికారి డి లక్ష్మయ్య, సూపర్‌వైజర్ నాగేశ్వరావు శుక్రవారం నిర్వహించారు. స్థానిక దేశవరపు క్యాంప్ తండాను సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. మురుగు కుంటలు, గృహాల్లోని నీటి తొట్లను పరిశీలించి, టిమోపాస్ మందును స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రజలు అందరూ మలేరియా, డెంగీ, వంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వారి వెంట ఏఎన్ఎం కుమారిబాయి, ఎంఎల్ హెచ్‌పీ సంధ్య, ఆశ వర్కర్ కుమారి ఉన్నారు.